సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 3 । మార్చి । 2023



హోం మంత్రిని కలిసిన కోలేటి

గోదావరిఖని: రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ జన్మదినం సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం కలుసుకున్నారు.



అలరించిన ఆటల పోటీలు

గోదావరిఖని: మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్జీ–2 ఏరియాలో సీఈఆర్ క్లబ్‌లో మ్యూజికల్ చైర్, స్పూన్‌రన్ పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/19.0

ఉదయం నుంచే ఎండవేడిమి అధికమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బిల్లులు చెల్లించి ఆదుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రాజు

సుల్తానాబాద్‌: గ్రామాల్లో సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టే రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రేగడిమద్దికుంట సర్పంచ్ రవీందర్ రెడ్డి బిల్లులు రాకనే ఆత్మహత్యకు యత్నించారని, పనులు చేసి ఏడాది దాటినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక సర్పంచులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ అంటే సర్పంచులు ఆత్మహత్య చేసుకోవడమేనా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా జోనల్ మహిళా కన్వీనర్ కుమ్మరి సవిత, ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్, కార్యవర్గ సభ్యులు కాంపల్లి బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ఉపాధ్యక్షుడు నార్ల గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సాతూరి అనిల్, మండల అధ్యక్షుడు బోయిని రంజిత్, పట్టణ అధ్యక్షుడు తోట మధు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఈవో

పాలకుర్తి: పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో మాధవి అన్నారు. పాలకుర్తి మండలం కన్నాల పాఠశాలలో నాలుగు మండలాలకు చెందిన భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులతో గురువారం సమావేశమయ్యారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. హెచ్ఎం మాధురి, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావు, డీసీఈబీ సహాయ కార్యదర్శి ఎం.నరేశ్, శ్రీనివాస్, శ్రీధర్, సతీశ్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



వాహనాలు ప్రారంభించి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కుమార్ దీపక్

పెద్దపల్లిరూరల్‌: మహిళలు, బాలల సంరక్షణకు అమల్లో ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో చెత్త సేకరించే వాహనాలను ప్రారంభించారు. మహిళలు, బాలలు వేధింపులు, ఇబ్బందులకు గురైతే వెంటనే మహిళలు 181, బాలలు 1098 టోల్‌ఫ్రీ ద్వారా సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఇందుకోసం ఆడియో రికార్డును చెత్త సేకరించే వాహనాలకు పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ బాధ్యతను మున్సిపాలిటీ, పంచాయతీలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవుఫ్‌ఖాన్, సీడీపీవో కవిత, సఖి కేంద్రం, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, పోషణ్‌అభియాన్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు



ధాన్యాన్ని గోటితో ఒలుస్తున్న మహిళలు

కోల్‌సిటీ: భద్రాద్రి సీతారాముల కల్యాణానికి మహిళలు గోటితో బియ్యం ఒలిచే కార్యక్రమానికి గోదావరిఖనిలో గురువారం ప్రారంభించారు. కళ్యాణ్‌నగర్‌లోని మన చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఇందారపు సునీత ఆధ్వర్యంలో భద్రాచలం రామయ్య కల్యాణానికి తలంబ్రాల కోసం ధాన్యాన్ని ఒలిచి బియ్యం పంపించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఇందారం సునీత, విజయలక్ష్మీ, మాధవి, సౌజన్య పాల్గొన్నారు.

ఆపరేషన్‌కే మొగ్గు..!

‘సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడండి. అలా చేస్తే తల్లీబిడ్డ ఆరోగ్యానికి మంచిది. సాధారణ ప్రసవమైతే పుట్టిన గంటలోపే తల్లిపాలు బిడ్డకు పట్టించడానికి వీలుంటుంది. ఇలా తొలిగంటలో అమ్మపాలు తాగిన బిడ్డలు చాలా ఆరోగ్యంగా ఉంటారు..’ ఇటీవల ధర్మారంలో పర్యటించిన సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించిన మాటలు. కానీ.. జిల్లాలో జరుగుతున్న ప్రసవాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 66శాతం, ప్రైవేట్‌లో 91శాతం సిజేరియన్లు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.



- పురుడు కోసం వస్తే సిజేరియన్ తప్పనిసరి..
- ప్రైవేట్‌తోపాటు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిదీ అదే తీరు..!
- నార్మల్‌కు అవకాశం ఉన్నా ఆసక్తి చూపని వైద్యులు
- కారణాలు విశ్లేషించి నియంత్రించాలంటున్న ప్రజలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల తీరు ఇలా..

ఏడాది	నార్మల్(ప్రభుత్వ)	సిజేరియన్	శాతం	నార్మల్(ప్రైవేటు)	సిజేరియన్	శాతం
22-23	1,549	2,929	65	369	2,666	87
21-22	1,377	2,806	67	279	3,760	93
20-21	1,401	2,870	67	258	3,633	93
మొత్తం	4,327	8,605	66	906	10,059	91

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పురుడు కోసం వెళ్లిన గర్భిణులకు పెద్ద ఆపరేషన్ (సిజేరియన్) మాత్రం తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు రిస్క్ పేరిట.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ధనార్జనే ధ్యేయంగా ఆపరేషన్లు చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం శస్త్ర చికిత్స ప్రసవాలు 15 శాతానికి మించకూడదు. కానీ కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోం వైద్యులు వ్యాపారం కిందకు మార్చేస్తున్నారు. గతంలో డెలివరీకి ముహూర్తాలు పెట్టొద్దని పూజారులతో సమావేశాలు నిర్వహించారు. జిల్లాలోని పలు దేవాలయాల్లో సైతం ‘ముహూర్తాలు పెట్టము..’ అని ఫ్లెక్సీలు కట్టి అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. కానీ మళ్లీ ఎప్పటిలాగే జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంతో సిజేరియన్లు పెరుగుతున్నాయి.

హైరిస్క్ పేరుతో సీ సెక్షన్

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో కొన్ని సందర్భాల్లో మత్తు ఇంజక్షన్ ఇచ్చే అనస్థీషియా వైద్యనిపుణులు, గైనకాలజిస్టులు అందుబాటులో లేకపోవడం.. రక్తహీనత గల గర్భిణులకు అవసరమైన రక్తం అందుబాటులో లేదనే కారణాలతో నొప్పులు వచ్చిన చివరి నిమిషంలో కరీంనగర్, ప్రైవేట్ వైద్యుల వద్దకు ఉరుకులు, పరుగులు పెట్టక తప్పటం లేదు. ఇదే అదునుగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో డబ్బుల కోసం సిజేరియన్లు చేస్తున్నారు.

సాధారణ కాన్పు ఆరోగ్యం

జిల్లాలో సిజేరియన్ కాన్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. సుఖప్రసవం కోసం కిశోర బాలిక ప్రాయం నుంచి సమతుల ఆహారం, శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. క్రమశిక్షణతో మెలగాలి. 18 ఏళ్లు దాటిన తరువాత మాత్రమే వివాహం చేయాలి. బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడేళ్ల వ్యవధి పాటించాలి. రక్తహీనత, ఇతర పోషకాహార లోపం వంటి సమస్యలపై వైద్యుల సలహాలు తీసుకోవాలి. గర్భం దాల్చింది మొదలు సుఖప్రసవానికి వీలుగా ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు తీసుకోవాలి.

ప్రైవేటులోనూ కోతలే..

ప్రసవ సమయం అంటేనే సాధారణంగా మహిళలు భయపడుతుంటారు. వారికి అవగాహన కలిపించి సాధారణ ప్రసవాలు చేయెచ్చు. కానీ ప్రైవేట్ ఆసుపత్రులు మాత్రం ప్రసవం కొంత ఇబ్బందికరంగా ఉన్నా.. గర్భిణులు భయపడుతున్నా సిజేరియన్లు చేయడంపైనే దృష్టి పెడుతున్నారు. సాధారణ ప్రసవానికి రూ.20వేల లోపే. సీ సెక్షన్ అయితే రూ.50వేల వరకు వసూలు చేసే అవకాశం ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రులు సీ సెక్షన్‌కు ఆసక్తి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం

పేరు నమోదు చేసుకున్న సమయం నుంచి కాన్పు అయ్యే వరకూ గర్భిణిపై ఆశాకార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సాధారణ ప్రసవాలు పెంచేలా ప్రచారం చేస్తున్నాం. అనారోగ్యాలకు గురికావద్దు. అవసరం లేకున్నా సిజేరియన్లు ప్రోత్సహించే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం.
– ప్రమోద్‌కుమార్, జిల్లావైద్యాధికారి

బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం మళ్లీ ట్రిప్

- బుధవారం అర్ధరాత్రి నిలిచిన ఉత్పత్తి
- ఇంకా సరఫరా చేయని బొగ్గు, ఆయిల్
- పునరుద్ధరణ పనుల్లో ఇంజినీర్లు, ఉద్యోగులు



బీ థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: నగరంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ– థర్మల్ విద్యుత్ కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ఇంజినీర్లు, ఉద్యోగులు చర్యలు చేపడుతున్నారు. రెండు నెలలుగా విద్యుత్ కేంద్రంలోని బాయిలర్ ట్యూబ్‌లో సాంకేతిక సమస్య ఏర్పడుతుండడంతో 48 గంటలు గడవకముందే షట్‌డౌన్ అవుతోంది. జనవరి 26 నుంచి విద్యుత్ కేంద్రానికి బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిపివేశారని, ప్లాంట్ విడిభాగాల కొనుగోలుకు రూ.15 కోట్లు ఇప్పిస్తే పదేళ్లు నిరాటంకంగా నడిపిస్తామని కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు ఎమ్మెల్యే చందర్‌కు ఏకరువు పెట్టిన విషయం తెల్సిందే. దీంతో ఎమ్మెల్యే మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి బొగ్గు, ఆయిల్ సరఫరా చేయించాలని కోరగా.. ఆయన సీఎండీని ఆదేశించారు. గురువారం వరకూ రీస్టోర్ కోసం ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రంలో మరో నాలుగు రోజులకు సరిపడా బొగ్గు, ఒకసారి విద్యుత్ కేంద్రం స్టార్ట్ చేసేందుకు ఆయిల్ మాత్రమే ఉందని అంటున్నారు. అర్ధరాత్రి వరకు విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చినా.. ఎన్ని గంటలు కొనసాగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోసారి షట్‌డౌన్ అయితే మాత్రం విద్యుత్ కేంద్రం కొనసాగింపు అంశం అధికారులు తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని ఇంజినీర్లు, అధికారులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

విద్యుత్ కేంద్రాన్ని పరిరక్షించాలని ప్రజాపంథా ఆందోళన

బీ – థర్మల్ విద్యుత్ కేంద్రం కొనసాగింపుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని పేర్కొంటూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు, ఆయిల్ సరఫరా చేయకుండా.. విడిభాగాల మార్పులకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తుండడం సరికాదన్నారు. నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, పెండ్యాల రమేశ్, ఆడెపు శంకర్, తీగుట్ల రాములు, కట్ట తేజేశ్వర్, దేవేందర్, మెతుకు వెంకటేశ్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న జీయర్ స్వామి

జ్యోతినగర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీత్రిదండి చిన జీయర్ స్వామి భక్తులకు ఉపదేశించారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని చిలుకలయ్య దేవాలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు స్వాగతం పలికారు. మన దేశ సంస్కృతిని ప్రపంచదేశాలు కీర్తిస్తున్నాయని, మనిషి మనిషిగా బతికితే దేవతలంతా చుట్టూనే ఉంటారని పేర్కొన్నారు. అనంతరం ఆలయ సమీపంలోని శ్రీలక్ష్మీకేశవ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు కేశవరావు, సతీశ్‌రావు, శరత్‌రావు పాల్గొన్నారు.

పరమాత్ముడు ఒక్కడే..

యైటింక్లయిన్‌కాలనీ: పరమాత్ముడు ఒక్కడేనని శ్రీత్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ పుష్కరోత్సవాలకు హాజరయ్యారు. భగవంతుడు అనేక రూపాల్లో దర్శనమిస్తారని, ఎవరికిష్టమైన రూపాన్ని వారు పూజించుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ శిఖరకుంభ సంప్రోక్షణ, శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ సతీమణి కళ్యాణిశ్రీనివాస్, ఏరియా జీఎం ఎ.మనోహర్ దంపతులు, సేవా అధ్యక్షురాల సవిత, ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర రావు, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, జయశ్రీ దంపతులు, ఆర్జీ–2 ఏరియా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు పస్తులుండాల్సిందేనా..!?



జిల్లాకేంద్రంలోని కమాన్ వద్ద రాజీవ్‌రోడ్డుపై ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఇష్టానుసారంగా ధరలు పెంపు
- పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థికభారం
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



నిరసన తెలుపుతున్న అంతటి అన్నయ్యగౌడ్

పెద్దపల్లిరూరల్‌: ప్రజా సంక్షేమం కోసం పాటుపడాల్సిన పాలకులు ప్రజలపై ఆర్థికభారాన్ని మోపుతూ పస్తులుండేలా చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళాదినోత్సవ కానుకగా గ్యాస్ సిలిండర్ల ధరను పెంచిందని విమర్శించారు. సరైన ఉపాధిలేక ఆర్థికంగా సతమతమవుతుంటే ఇలా గ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచడం సరికాదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, మల్లయ్య, శ్రీనివాస్, సుభాష్‌రావు, సంపత్, మస్రత్, సర్వర్, జగదీశ్, సునీల్‌గౌడ్, సంతోష్, రాజ్‌కుమార్, బొక్కల సంతోష్, ఖాజా తదితరులున్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌: గ్యాస్ ధరల పెంపుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కట్టెల పొయ్యి దిక్కువుతోందని ఉమ్మడి జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. పూసాల రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిందన్నారు. ఎన్డీఏ హయాంలో రూ.410గా ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1175కి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆందోళనను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాష్ రావు, మండల అధ్యక్షులు చిలుక సతీశ్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కలవల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రావు, సాహిరి మహేందర్, అమిరి శెట్టి తిరుపతి, రాజలింగు, రామన్న, తిరుపతిరావు, కుమార్ కిశోర్ ఉన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరి పెంచాలి

కాల్వ శ్రీరాంపూర్: విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరి పెంపొందించాలని ఎఫ్ఎల్ఎన్ పథకం రాష్ట్ర పరిశీలకులు అర్జున్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని జెడ్పీహెచ్ఎస్ కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, మడిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేయడమే కాకుండా ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ప్రాథమికోన్నతస్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు చేశారు. టీఎల్ఎం ఆధారిత, విద్యార్థి కేంద్రీకృత విద్యాబోధనతో విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. తాను పనిచేస్తున్న పాఠశాలలోనే తన ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్న మడిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కవితను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, వాటిని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య, కాల్వశ్రీరాంపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వై.రమేశ్, సెక్టోరియల్ అధికారి పీఎం షేక్, మానిటరింగ్ టీం సభ్యులు భరత్ రెడ్డి, కర్రె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులైనా ముందుకు సాగని పనులు



పంప్‌హౌస్‌లో చేరిన నీటిని రిజర్వాయర్‌లోకి పంపిస్తున్న సిబ్బంది



మరమ్మతులో ఉన్న బటర్‌ఫ్లయ్ వాల్వ్

- ఎల్లంపల్లి మోటార్ల పునరుద్ధరణలో అధికారుల నిర్లక్ష్యం
- నత్తనడకన సాగుతున్న మరమ్మతు ప్రక్రియ
- ఆందోళనలో నారాయణపూర్ రిజర్వాయర్ రైతులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం ఎల్లంపల్లి పంప్‌హౌస్ వద్ద ఎత్తిపోతల పైప్‌లైన్ పగిలి మూడు రోజులు గడుస్తున్నా మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఎత్తిపోతల నీటికోసం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ ఆయకట్టు కింది రైతులు ఎదురుచూస్తుండగా.. అధికారులు మాత్రం మరమ్మతు పనులను వేగవంతం చేయడం లేదు. మంగళవారం మధ్యాహ్నం పైప్‌లైన్ పగిలిపోయిన విషయం తెల్సిందే. అధికారులు సకాలంలో స్పందించి మరమ్మతు చేపడితే రోజుల వ్యవధిలోనే అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. కానీ.. మూడు రోజులవుతున్నా.. పనులు యుద్ధ ప్రాతిపదికన జరగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంప్‌హౌస్ పైభాగంలో ఉన్న బటర్‌ఫ్లయ్ వాల్వ్‌లోని పైప్ పగిలిపోయి నీరంతా పంప్‌హౌస్‌లోకి చేరి నాలుగు పంపులు మునిగిపోయాయి. ఆ నీటిని బయటకు తోడేసేందుకు గురువారం ఉదయం మూడు మోటార్లను అమర్చారు. ఆ మోటార్ల సహాయంతో తిరిగి రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. అయితే ఇక్కడ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ స్పష్టంగా కనిపిస్తోంది. ఉదయం మోటార్లు పెట్టినా.. విద్యుత్ కోత కారణంగా నాలుగు గంటలు ఆలస్యంగా మోటార్లు ప్రారంభమయ్యాయి. పంప్‌హౌస్‌లో చేరిన నీటిని మోటార్లు ఎత్తిపోస్తే శుక్రవారం ఉదయం వరకు పంపులు బయటపడే పరిస్థితి ఉంది. ఆ నీరు మొత్తం తోడేశాక పంప్‌హౌస్‌లో చేరిన సిల్ట్ తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే పంప్‌లోని వాల్వ్‌లను అనుభవం కల్గిన ఇంజినీర్లతో శుభ్రం చేయాల్సి ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. పంప్‌హౌస్‌లో చేరిన నీటిని తోడేస్తున్నా.. పగిలిపోయిన బటర్‌ఫ్లయ్ వాల్వ్ బైపాస్ పైప్ వద్ద మరమ్మతు పనులు మాత్రం జరగడం లేదు. గురువారం ఉదయం వచ్చిన ప్రైవేటు వర్కర్లు మధ్యాహ్నం వెళ్లిపోయారు. ఫలితంగా మరమ్మతు పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నీరున్నా ఎండుతున్న పంటలు..

2016లో ఈ పథకం అందుబాటులోకి వచ్చిన తర్వాత దాదాపు నాలుగేళ్లు ఎలాంటి సమస్యలూ లేకుండా కుంటలు, చెరువులతోపాటు గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయించారు. ఆయకట్టు రైతుల భూములు సస్యశ్యామలంగా మారాయి. 2021లో పంపులను స్టార్ట్ చేయగా భారీగా కురిసిన వర్షాలకు మండలంలోని కటికెనపల్లి సమీపంలో పైప్‌లైన్ దాదాపు 200 మీటర్లకు పైగా పొడవునా పైకి లేచాయి. ఆ పనులు పూర్తి చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్ సీజన్ దాటిపోయింది. దీంతో ఆయకట్టులోని పంటలు కొన్ని ప్రాంతాల్లో ఎండిపోయాయి. గతేడాది కురిసిన వర్షాలకు నారాయణపూర్ రిజర్వాయర్‌తోపాటు కుంటలు, చెరువులు తెగిపోవటంతో ఇటీవల ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టి పూర్తిచేసింది. దీంతో సాగునీరు అందించాలని నారాయణపూర్ ఆయకట్టు రైతులు డిమాండ్ చేయడంతో గత నెల 28న అధికారులు ఎల్లంపల్లి పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలు ప్రారంభించారు. అయితే ప్రారంభించిన నాలుగు గంటలకే బటర్‌ఫ్లయ్ వాల్వ్ లోపలి పైప్ పగిలిపోయింది. ఫలితంగా ఎత్తిపోతలు నిలిచిపోయాయి. అసలే పంటలు పొట్ట దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేసి పంటలకు సాగునీరు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు.. ఉత్సవ విగ్రహాలు

- నిధులు రాకపోవడంతో ఎంపీటీసీ సభ్యుల అసంతృప్తి
- గెలిచిన నాలుగేళ్లలో చేతికందినవి రూ.5 లక్షల్లోపే
- అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన
- ప్రభుత్వం రూ.10 లక్షలివ్వాలని వేడుకోలు


ధర్మారం మండల పరిషత్ కార్యాలయం

ధర్మారం(ధర్మపురి): ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే గ్రామాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.. ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.. కానీ ప్రస్తుతం ఆ ప్రజాప్రతినిధులకే నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారు. తమను గెలిపించిన ప్రజలు అభివృద్ధిపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికంగా వెనకబడినవారే ఎక్కువ..

ధర్మారం మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులతోపాటు ఒక మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఉన్నారు. నిధులు లేకపోవడంతోపాటు కనీసం తమకు ప్రాధాన్యం దక్కడం లేదని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులం అన్న మాటే తప్ప.. ఎందుకూ పనికి రాకుండా పోతున్నామని అంటున్నారు. తిరిగి ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్లాలని ఆవేదన చెందుతున్నారు. నాలుగేళ్లుగా ఎంపీటీసీ సభ్యులకు వచ్చిన నిధులు రూ.5 లక్షల్లోపే. వీటితో గ్రామాలను ఏం అభివృద్ధి చేస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. గెలిచిన వారిలో ఆర్థికంగా వెనకబడినవారే ఎక్కువ మంది ఉన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

15 శాతం నిధులు రావాలి..

మండల పరిషత్ ఎన్నికలు జరిగి నాలుగేళ్లవుతోంది. గతంలో జెడ్పీల ద్వారా గ్రామాలకు నిధులు అందేవి. కానీ 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రస్తుతం వాటి నుంచి కాకుండా నేరుగా గ్రామ పంచాయితీలకు చేరుతుండటంతో మండల పరిషత్‌ల ప్రాధాన్యం తగ్గింది. ఇప్పుడు 80 శాతం నిధులు గ్రామ పంచాయితీలకు, 15 శాతం మండల పరిషత్‌లకు, 5 శాతం జిల్లా పరిషత్‌లకు కేటాయిస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో ఎంపీటీసీకి ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రావాల్సి ఉంది. కానీ ఆ విధంగా నిధులు రావడం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఎంపీటీసీ సభ్యులకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన మేర రావడం లేదని వారు అసంతృప్తితో ఉన్నారు. పేరుకే ప్రజాప్రతినిధులం.. కానీ ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా నిధులు కేటాయించలే..



మేము ఎంపీటీసీ సభ్యులుగా గెలిచి, నాలుగేళ్లవుతోంది. రెండేళ్లుగా నిధులు కేటాయించలేదు. 2020–21, 2021–22 లకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కింద ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు కేటాయించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఈ డబ్బులు సరిపోవు. గ్రామాల అభివృద్ధికి తక్షణమే నిధులు మంజూరు చేయాలి.

– బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, పత్తిపాక

హామీలు ఎలా నెరవేర్చేది?



ఎంపీటీసీ సభ్యులకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం పక్షపాతం చూపిస్తోంది. గతంలో 15వ ఆర్థిక సంఘం కింద మండల పరిషత్‌లకు 30 శాతం నిధులిచ్చేవారు. ఇప్పుడు 15 శాతానికి తగ్గించారు. నిధుల కొరతతో సభ్యులందరం ఇబ్బందులు పడుతున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చేది? ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10 లక్షలు కేటాయించాలి.

– కాదాసి శంకరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, కమ్మరిఖాన్‌పేట

క్లుప్తంగా

ఏఐటీయూసీ రెండో మహాసభలకు రండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఈ నెల 5న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏఐటీయూసీ రాష్ట్ర 2వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ కత్తుల కొమురయ్య భవన్‌లో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ సభలకు అన్ని వర్గాల కార్మికులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసీ కేంద్ర కార్యదర్శి, ఎల్.ప్రకాశ్, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రామగుండం రీజియన్ కార్యదర్శి బుర్ర తిరుపతి, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


చైతన్య (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన కామిడి చైతన్య(23) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చైతన్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించి, మందులు వాడుతున్నా నయం కాలేదు. ఈ క్రమంలో గురువారం కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తండ్రి లక్ష్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్జీ–2 కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జీఎం పర్సనల్ ఎం.మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి యాజమాన్యం ఓబీ యాజమాన్యాలను ప్రోత్సహిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. ఇప్పటికైనా ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర తిరుపతి, ఎంఏ.గౌస్, పూసాల తిరుపతి, ఎ.వెంకన్న, బి.అశోక్, మద్దెల శ్రీనివాస్, శనగల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఎన్టీపీసీలో ప్రీతికి నివాళి


నివాళి అర్పిస్తున్న ఎన్టీపీసీ పీటీఎస్ వాసులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో మెడికో ప్రీతి మృతికి సంతాపంగా కొవ్వొత్తులతో నివాళి అలర్పించారు. గురువారం రాత్రి పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ప్రధాన దుకాణ సముదాయంలో రామగుండం కార్పొరేషన్ 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత ఆధ్వర్యంలో మెడికో ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. అనంతం ప్రీతి మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముందుగా టౌన్‌షిప్‌లోని పలు వీధుల మీదుగా ప్రదర్శన చేపట్టారు. సోమ్లానాయక్, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటస్వామి, స్వామి, కనకయ్య, జ్యోతి, పద్మ, బేడి, సంధ్యారెడ్డి, అరుణ, వనజ, సుధాకర్, సంజీవరావు, మహిళలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ



జ్యోతినగర్(రామగుండం): ఓ పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కానిస్టేబుల్ రమేశ్ ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని బి–138 క్వార్టర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం గదికి తాళం వేసి, బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి వెనక తలుపు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసి, చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై బి.జీవన్‌లు పరిశీలించారు. క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. బంగారు నగలతోపాటు టీవీ, ఇతర వస్తువులు మొత్తంగా రూ.80 వేల విలువైన సామగ్రి చోరీకి గురయ్యాయని బాధితుడు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

కోల్‌సిటీ: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం మేయర్ అనిల్ కుమార్ అధ్యక్షతన వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత రూ.300 కోట్ల అంచనాలతో వార్షిక బడ్జెట్ తయారు చేసి, ఉన్నతాధికారుల సూచనల మేరకు రూ.221 కోట్లతో రూపొందించారు. కౌన్సిల్ ఆమోదం పొందడానికి ఇప్పటికే కార్పొరేటర్లకు ఎజెండా కాపీలు అందించారు. బడ్జెట్ మీటింగ్ అనంతరం జనరల్ బాడీ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు నివాళి

మంథని: ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ శ్రీపాదరావు 86 జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మంథనిలోని శ్రీపాదరావు విగ్రహాలకు ఆయన తనయుడు, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ బాబు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, డీఎస్బార్ యువసేన నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి తదితరులున్నారు.

కమాన్‌పూర్(మంథని): మండలంలో గురువారం మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ వైనాల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య తదితరులున్నారు.

సుల్తానాబాద్(పెద్దపల్లి): బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాశ్‌రావు, మండల అధ్యక్షుడు సతీశ్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్ తదితరులున్నారు.

రామగుండం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ రామగుండం పట్టణంలోని పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్ అందజేశారు. కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు సాదు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న శ్రీధర్‌బాబు, నాయకులు


నివాళి అర్పిస్తున్న రాజ్‌ఠాగూర్, నాయకులు

గోదావరిఖని(రామగుండం): స్థానిక శ్రీపాదరావు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేశ్, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, ముస్తఫా, విజయ తదితరులున్నారు.

రామగిరి(మంథని): బుధవారంపేట(రామయ్యపల్లి) బస్టాండ్ వద్ద శ్రీపాదరావు విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు తోట చంద్రయ్య, సర్పంచ్ దేవునూరి రజిత, నాయకులు పాల్గొన్నారు.

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, నాయకులున్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, ఈర్ల కొమురయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక షాపింగ్ కాంప్లెక్స్‌లోని శ్రీపాదరావు విగ్రహానికి నివాళి అర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజేశ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

30లోగా ఆరోగ్య ఉప కేంద్రాలు పూర్తవ్వాలి

- కలెక్టర్ సంగీత

సాక్షి ఎఫెక్ట్

కమాన్‌పూర్(మంథని): జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జికలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. 'అద్దె భవనాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు' శీర్షికన 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ కమాన్‌పూర్ మండలంలోని పేరపల్లి, జూలపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఉప కేంద్రాలను పరిశీలించారు. పనులు పూర్తి కాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ నెల 30లోగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని అధికారులకు చెప్పారు. ప్రజకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటు వైద్య సేవలందించాలని పేర్కొన్నారు. జూలపల్లి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి, ఈజీఎస్‌కు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. సిద్దిపల్లె గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, టీఎస్‌ఎంఎస్ఐడీసీ డీఈఈ రాజారెడ్డి, ఏఈ అనిల్, సర్పంచులు బొల్ల పెల్లి శంకర్ గౌడ్, తాటికొండ శంకర్, తొగరి అన్నపూర్ణ, తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, పంచాయితీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

జీడీకే–11 ఇంక్లయిన్ గని తనిఖీ

గోదావరిఖని(రామగుండం): జీడీకే–11 ఇంక్లయిన్ గనిని డీడీఎంఎస్, మైనింగ్ కమలేశ్‌కుమార్ వర్మ గురువారం తనిఖీ చేశారు. మొదట గని ఏజెంట్ కార్యాలయంలో 1సీమ్ సీ–1 ప్యానెల్, గని ప్లాన్‌లను పరిశీలించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ఆర్‌జీ–1 బండి సత్యనారాయణ, గని ఏజెంట్ సి.శ్రీనివాస్, మేనేజర్ ఎ.నెహ్రూ, గ్రూప్ ఇంజినీర్ బి.రాందాస్, యాక్టింగ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.జాన్సన్, డిప్యూటీ ఎస్ఎస్‌వో వై.హనుమాండ్లు, పిట్ ఇంజినీర్ ఎం.రాజబాబు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.


గనిలోకి వెళ్తున్న డీడీఎంఎస్ కమలేశ్‌కుమార్ వర్మ

ప్రజాప్రతినిధుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు

- పెండింగ్ బిల్లులు నెలాఖరులోగా చెల్లించండి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు
- రేగడిమద్దికుంట సర్పంచ్‌కు పరామర్శ

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రజాప్రతినిధుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దని టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట సర్పంచ్ రవీందర్‌రెడ్డి తాను గ్రామంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని పురుగుల మందు తాగగా కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా గురువారం ఆస్పత్రికి వెళ్లి, ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. చేసిన పనులకు బిల్లులు రాక స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మహత్య చేసుకుంటున్నా రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే సర్పంచులకే న్యాయం జరగకపోతే సామాన్యుడికి ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు మాత్రమే బిల్లులు వస్తున్నాయన్నారు. సర్పంచుల నుంచి జెడ్పీటీసీ సభ్యుల వరకు బిల్లులు అందకపోవడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ బిల్లులన్నీ ప్రజాప్రతినిధులకు, కాంట్రాక్టర్లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ప్రకాశ్‌రావు, మాజీ సర్పంచ్ అన్నయ్య గౌడ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సతీశ్, నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.


రవీందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న విజయరమణారావు

ఆస్పత్రికి వెళ్లిన ఎమ్మెల్యే దాసరి..


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రేగడిమద్దికుంట సర్పంచ్ రవీందర్‌రెడ్డిని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి గురువారం కరీంనగర్‌లోని ఆస్పత్రికి వెళ్లి, పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత, సర్పంచు విజేందర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రమేశ్ గౌడ్, నాయకులు అరుణ్ తదితరులున్నారు.

11న 'ట్రినిటీ'లో టెక్నో స్పార్క్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 11న జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంను టెక్నో స్పార్క్ 2023 పేరిట నిర్వహిస్తున్నామని విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం సంబంధిత బ్రోచర్ ఆవిష్కరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు ఇలాంటి కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ జాతీయస్థాయి సెమినార్‌లో పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, జస్ట్ మినిట్, థీమ్‌డ్యాన్స్, షార్ట్‌ఫిలిం, ఫన్‌గేమ్ తదితర కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. అన్ని ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశ్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, హెచ్‌వోడీలు నటరాజన్, స్వాతి, ప్రభాకర్, ఆంజనేయులు, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి

- ఆపరేషన్ ఆలస్యమే ప్రాణం తీసిందన్న బంధువులు
- పాపకు హార్ట్‌బీట్ తక్కువుండటమే కారణమంటున్న వైద్యులు
- మూడు రోజుల క్రితమే దవాఖానాలో చేరిన గర్భిణి
- నార్మల్ డెలివరీ కోసం వేచిచూసిన వైనం
- విచారణ జరిపిస్తాం : డీసీహెచ్ శ్రీధర్


బాలింత సుమంగళి


చనిపోయిన శిశువు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన కలువల సుమంగళి అనే గర్భిణి గత నెల 28న స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో చేరింది. గురువారం ఆపరేషన్ చేయగా పాప జన్మించింది. కాసేపటికే హార్ట్‌బీట్ లేకపోవడంతో కుటుంబసభ్యులు వైద్యులకు సమాచారం అందించారు. పిల్లల డాక్టర్ పరిశీలించి, మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధితులతోపాటు వారి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్సై ఉపేందర్‌రావు దవాఖానాకు చేరుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని బాధితులు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీహెచ్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజులు సాధారణ ప్రసవం కోసం వేచిచూశారని, ముందే ఆపరేషన్ చేసి ఉంటే పాప బతికేదని సుమంగళి సోదరుడు సురేష్ తెలిపాడు. ఆస్పత్రిలో మందులు లేవంటే బయట కొనుగోలు చేశామని పేర్కొన్నాడు. డ్యూటీలో ఉన్న నర్సుల ప్రవర్తన బాగాలేదని, విధులు నిర్వహించే డాక్టర్ స్థానికంగా ఉండకపోవడం, సకాలంలో ప్రసవం చేయకపోవడం వల్లే శిశువు చనిపోయిందని ఆరోపించాడు.

చెప్పినా వారు వినలేదు : వైద్యురాలు

పాప కుటుంబసభ్యుల అంగీకారం మేరకే ప్రసవం చేసినట్లు వైద్యురాలు రమాదేవి తెలిపారు. హార్ట్ బీట్ తక్కువగా ఉందని కరీంనగర్ లేదంటే పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పినప్పటికీ వారు వినలేదన్నారు. బాధితుల నుంచి వివరాలు తీసుకున్నామని డీసీహెచ్ తెలిపారు. కమిటీ వేసి, విచారణ జరిపి, న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

'గాయత్రి'లో ఫేర్‌వెల్ పార్టీ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ పార్టీ జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రతీ విద్యార్థి ఒక ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, సాధించాలని అందుకు తమ అండదండలుంటాయని గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకొని, తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్ సురేశ్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.